# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 10 జూన్, 2026 | పేజీలు :08




# వేగవంతంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం

జిల్లా కలెక్టర్, చిత్ర మిశ్రా

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి చొప్పదండి, గంగాధర తహసీల్దార్ కార్యాలయాల్లో సమీక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్ :** పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా రెవెన్యూ అధికారులను

తరువాయి 2లో...

# ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములను సందర్శించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, హమాలీల సంఖ్యను పెంచి, అన్‌లోడింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం అన్‌లోడింగ్ చేస్తున్న తీరును అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాల్లోని ధాన్యం హమాలీల సంఖ్యను మరింత పెంచి అన్‌లోడింగ్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని, అన్‌లోడ్ అయిన వాహనాలను ధాన్యం లోడింగ్ కోసం ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తున్న తీరు, గోదాముల సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుండి వాహనాలను జాప్యం చేయకుండా లోడింగ్ చేసి తరలించేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భనలో పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్ ఉన్నారు.





# ప్రమాదకరంగా మూలమలుపులు

భీమ్‌గల్- వేల్పూర్ ప్రధాన రహదారిపై ప్రమాదకర మలుపు

హెచ్చరిక బోర్డు, లైట్లు లేక వాహనదారుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ నుండి వేల్పూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఒక మలుపు ప్రస్తుతం ప్రయాణీకులకు మృత్యుపాశంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణం సాగిస్తున్నారు. రహదారికిరువైపులా పిచ్చిమొక్కలు, చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు అస్సలు కనిపించటం లేదు. మలుపుల వద్ద రోడ్డు సరిగ్గా కనిపించకపోవటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ముమ్మరంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మలుపుల వద్ద ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవల్సి వస్తోంది. వెంటనే స్పందించి హెచ్చరిక బోర్డులు, ప్రమాదకరమైన మలుపు ఉందని తెలిపేలా తక్షణమే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలి. హైమాక్స్ లైట్లు చీకట్లో రోడ్డు స్పష్టంగా కనిపించేందుకు వీలుగా మలుపుల వద్ద హైమాక్స్ లైట్లను అమర్చాలి. చెట్ల తొలగింపు రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్ల పిచ్చిచెట్లను వెంటనే నరికివేయాలి. ఇప్పటికైనా సం బంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారిపై తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, ఏదైనా పెద్ద ప్రమాదం జరగక ముందే అప్రమత్తం కావాలని వాహనదారులు కోరుతున్నారు.



## దుమ్ము, ధూళితో స్థానికుల అవస్థలు

# నిలిచిపోయిన రోడ్డు పనులు

2

# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఎమ్మెల్యే సంజయ్

2



## ఘనంగా ఎల్లమ్మతల్లి బోనాలు



ప్రజాపక్షం/వీర్నపల్లి : మండల కేంద్రం లోని గర్జనపల్లి గ్రామంలో ఎల్లమ్మతల్లి బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని డప్పుల మోతల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఎల్లమ్మతల్లికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమను సల్లంగా చూడు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుచ్చగారి రాకేష్ గౌడ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన ఐకెపి సిబ్బంది



ప్రజాపక్షం/ముప్కాల్ : హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన కార్యక్రమంకు ముప్కాల్ మహిళ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఐకెపి, సిసి, సిఎ, విఓఎలు మహిళా గ్రూప్ సభ్యులు తరలివెళ్లారు.

## బై-బ్యాక్ సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : వరి, మొక్కజొన్న తదితర పంటలను బైబ్యాక్ విధానంలో సాగు చేసే రైతులు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకునే ముందు అన్ని నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించాలని మండల వ్యవసాయ అధికారి ఎ.రాజ్‌కుమార్ మండల రైతులకుసూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా కంపెనీ లైసెన్స్, విత్తన నాణ్యత, కొనుగోలు ధర, చెల్లింపు గడువు, నష్టపరిహారం తదితర అంశాలు ఒప్పందంలో స్పష్టంగా ఉండాలని తెలిపారు. స్టాంప్ పేపర్‌పై లిఖితపూర్వక ఒప్పందం చేసుకుని దాని కాపీని భద్రపరచుకోవాలని సూచించారు. నోటి మాటలను నమ్మకుండా పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే ఒప్పందంపై సంతకం చేయాలని రైతులకు ఏవో సూచించారు.



# వేగవంతంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ చొప్పదండి, గంగాధర తహసీల్దార్ కార్యాలయాలను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి (రెవెన్యూ) తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్లతో కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. సంబంధిత ఫైళ్లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఎల్ఏ మార్గదర్శకాల మేరకు సాదాబైనామా దరఖాస్తులు, రికార్డులు, సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, పెండింగ్ కేసులను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు అనుకూలమైన, స్నేహపూర్వక వాతావరణంలో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తుకు నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ డీ సూపరింటెంట్ మోబిన్, చొప్పదండి, గంగాధర తహసీల్దార్లు నవీన్ కుమార్, రజితతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాపక్షం/మెట్‌పల్లి : వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్.కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. జిల్లాలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటేనే పంటల సాగు సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్, ఎరువుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# నిలిచిపోయిన రోడ్డు పనులు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మంథని గంగాపూర్ నుండి ఓడేడ్ వరకు నాణ్యతతో కూడిన రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం పూర్తి దశకు చేరుకున్నాయి. అయితే, ముత్తారం మండల కేంద్రం నుండి కాసర్లగడ్డ సుమారు ఒక కిలోమీటర్ నర వరకు జరగాల్సిన రోడ్డు పనులు మాత్రం మధ్యలోనే నిలిచిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**ఇళ్లను కోల్పోతుండటమే ప్రధాన కారణమా..?** ముత్తారం మండల కేంద్రం నుండి కాసర్ల గడ్డ బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో కూడిన అత్యాధునిక రోడ్డు నిర్మాణ పనులు జరగాల్సి ఉంది.అయితే రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను కోల్పోవాల్సి వస్తుండటమే ఈ పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు, స్థానికుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

**నరకప్రాయంగా మారిన ప్రయాణం.. బాధితుల ఆవేదన :** రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రోడ్డు పక్కన ఉన్న గృహాల యజమానులు, వ్యాపారస్తులు, రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్తున్న సమయంలో విపరీతంగా లేస్తున్న దుమ్ము, ధూళి వల్ల శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి, దుకాణాల్లోకి దుమ్ము చేరుతుండటంతో నానా అవస్థలు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

**గృహాలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు వేయాలి :** రోడ్డు విస్తరణ పనుల వల్ల స్థానికంగా ఉండే నివాస గృహాలకు ఎలాంటి నష్టం లేదా ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఇళ్లను కోల్పోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి :** ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక ప్రజలు,వాహనదారులు కోరుతున్నారు. గృహాలకు ఇబ్బందులు లేకుండా చూస్తూనే, తక్షణమే నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పునఃప్రారంభించి, పనులను పూర్తి చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ముప్కాల్ : మండలంలోని నాగంపేట్ గ్రామంలో మంగళవారం ఉదయం కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి గంగాధర్ చేతుల మీదుగా రాంధేని లిఖిత, వడ్డేపల్లి అమూల్య, చందూరి సుప్రియ చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వసంత్‌రావు, ఆర్ఐ రవి, జీపీఓ చందు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగాధర్‌కు నివాళులర్పించిన పోలీసు అధికారులు



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ గుండెపోటుతో మృతి చెందగా మంగళవారం ఏసీపీ ప్రకాష్ యాదవ్, రూరల్ సిఐ సురేష్‌కుమార్, మోపాల్ ఎస్సై సుమిత, భీమ్‌గల్ సిఐ సత్యనారాయణగౌడ్, కమ్మర్‌పల్లి ఎస్సై సతీష్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మోపాల్ పిఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం మోపాల్ మండల పరిధిలో జరిగిన కార్యక్రమంలో మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించారు. అనంతరం ఆయన అక్కడి నుండి భోజనం చేసేందుకు నిజామాబాద్‌లోని న్యాల్‌కల్ రోడ్డులోని తన ఇంటికి వచ్చారు. ఇంట్లో భోజనం తినే సమయంలో ఛాతినొప్పి వస్తుందని చెప్పటంతో అతని భార్య, కుమారుడు కలిసి గంగాధర్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఆయనను పరీక్షించిన వైద్యులు మరణించినట్లు తెలిపారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా రూ. 30వేలు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుండి వచ్చే ప్రయోజనాలు వచ్చేలా చూస్తామని హామీనిచ్చారు.

# 13న బిజెపి స్వచ్ఛ పాఠశాల

### కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ వినూత్న కార్యక్రమం

ప్రజాపక్షం/కరీంనగర్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "స్వచ్ఛ పాఠశాల" పేరుతో తన పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజవర్గాల్లోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ పరిశుభ్రం చేయాలని నిర్ణయించారు. "స్వచ్ఛ పాఠశాల" పేరుతో ఈనెల 13న ఆయా పాఠశాలలన్నింటినీ పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జిల్లాల అధ్యక్షులు, మండలాధ్యక్షులతో మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. మోదీ 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈనెల 15నుండి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలన్నింటినీ పరిశుభ్రం చేసి సుందరంగా ముస్తాబు చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంలో నేడు మండలాల వారీగా పార్టీ కార్యకర్తలంతా సమావేశమై ఒక్కో పాఠశాల వారీగా ఇంచార్జీలను నియమించాలని సూచించారు. ఈనెల 11, 12 తేదీల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో "టిఫిన్ బైఠక్" పేరుతో సమావేశం నిర్వహించాలని పిలుపునిచ్చారు. "ప్రతి స్కూల్ లోని ఎన్ని తరగతి గదులుంటాయో, ఒక్కో గదికి ఇద్దరు చొప్పున కార్యకర్తలను కేటాయించాలి. ఈనెల 13న అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతి గదులను శుభ్రం చేయించాలి. అవసరమైతే చీపురు, క్లాత్ వంటి వస్తువులను తీసుకెళ్లాలి. క్లాస్ రూంలను శుభ్రం చేయడంతోపాటు ఆయా పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేయాలి. స్కూల్ ను క్లీన్ చేయడం ద్వారా ఒక మంచి వాతావరణం కల్పించాలి. ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రాం వంటి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి" అని కోరారు. దీంతోపాటు ఈనెల ప్రతి గ్రామంలో "మీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి" అనే నినాదంతో ఊరూ వాడా ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదివే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో ఉచితంగా బ్రాండెడ్ సైకిల్ ను అందజేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈసారి రికార్డు స్థాయిలో ఒకేసారి ఒకే టైంలో అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేసి అవసరమైతే గిన్నిస్ బుక్ రికార్డులో నమోదయ్యేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.



# కళ్ళమంటతోనే ఈశ్వర్, జీవన్‌రెడ్డిల దిగజారుడు ఆరోపణలు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ప్రజాపాలనను అందిస్తూ ఉంటే మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్ అన్నారు. ముఖ్యంగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తూ ప్రజాభిమానం పొందుతున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై కళ్ళమంటతో అక్రమ ఇసుక రవాణాను ప్రత్సహిస్తున్నారని, ధాన్యం కొనుగోలులో కటింగ్‌లో మంత్రి వాటా ఉందని పసలేని ఆరోపణలు చేయడం విస్తుగొల్పుతోందని దినేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మపురి మండల కాంగ్రేస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్ష ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, వేముల రాజేష్ లతో కలిసి దినేష్ మాట్లాడారు. వడ్ల కొనుగోళ్లలో అవినీతి,ఇసుక మాఫియాలో మంత్రి హస్తం ఉందంటూ అడ్లూరిపై ఆరోపణలు చేసిన కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డిలు ఆ మాటల్ని భేషరతుగా వెనక్కి తీసుకోవాలని దినేష్ డిమాండ్ చేశారు.15 ఏళ్ళు ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా వుండి ఇంత దిగజారుడు మాటలు మాట్లాడటం కొప్పుల ఈశ్వర్ విజ్ఞతకే వదిలిపెడుతున్నామని అన్నారు. అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తూ మంత్రి వాటా తీసుకుంటున్నాడు అనే ఆరోపణల్లో నిజం వుంటే మరి 15 ఏళ్లుగా ఈ ప్రాంత ఎమ్మెల్యేగా మంత్రిగా ఎన్ని కోట్లు కూడబెట్టావో చెప్పాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులైన ట్రాక్టర్ యజమానుల పొట్టకొట్టే నిందలు మానుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్ళు కొనసాగి పార్టీ మారి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కాగానే జీవన్ రెడ్డి ఉనికి చాటుకునేందుకు తాపత్రయ పడుతున్నాడని అందుకే మంత్రి అడ్లూరిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి,మంత్రి అడ్లూరిల బంధం అన్నదమ్ముల్లా ఉండేదని, ఇప్పటికీ ఆయనను మంత్రి అడ్లూరితోపాటు తామూ గౌరవిస్తామని చెప్పారు. దిగజారుడు ఆరోపణలతో జీవన్ రెడ్డి ఆ గౌరవాన్ని కోల్పోయాడని దినేష్ అన్నారు. ధర్మపురి పట్టణంలో 15 కోట్ల నిధులతో రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని మరోవైపు సుమారు 200 ఇందిరమ్మ ఇళ్ళు పూర్తి కావస్తున్నాయని ఇలా ధర్మపురిని ప్రగతిపథంలో నడిపిస్తున్న మంత్రిపై కళ్ళమంటతో విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో సమస్యలపై తప్పకుండా ప్రశ్నించాలని నిరసనలూ తెలుపవచ్చని కానీ కేవలం దళిత మంత్రి ఎదుగుదలను ఓర్వలేక ఇంతగా దిగజారుడు ఆరోపణలు సీనియర్లయిన వారికి తగదని హితవు చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వడ్ల కొనుగోళ్లపై ఆరోపిస్తున్న కొప్పుల ఈశ్వర్ ఒకటి రెండు సెంటర్లను తప్ప ఒక్క కొనుగోలు కేంద్రాన్నీ సందర్శించిన పాపానపోలేదని ముమ్మందు ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవాచేశారు. ఈ సమావేశంలో నాయకులు శైలేందర్ రెడ్డి, జక్కు రవీందర్, సంగ నర్సింహులు, కుంట సుధాకర్, మొగిలి, సంగి ఆనంద్, వొజ్జల లక్ష్మణ్, సుముఖ్, ప్రసాద్, భీంరాజ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలోరక్తదా నం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :**మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వెంకట అలేఖ్య నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న గుమ్మిరియల్ గ్రామానికి చెందిన మారుత అనే మహిళకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమైంది.ఈ విషయమై రక్తదాతల అనుసంధానకర్తలు ఉదయ్ కుమార్,వంగళ సాగర్‌ను కుటుంబ సభ్యులు సంప్రదించారు.వారు సమాచారం అందించడంతో సామాజిక సేవకుడు, శాశ్వత రక్తదాత, బీఆర్ఎస్ నాయకుడు, చేర్ల కొండాపూర్ సర్పంచ్ బాస లాస్య భర్త బాస ఆనంద్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు.దీంతో బాధిత మహిళకు సకాలంలో చికిత్స అందే అవకాశం కలిగింది.చేర్ల కొండాపూర్ గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న బాస ఆనంద్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,ఆసుపత్రి సిబ్బంది,రక్తదాతల అనుసంధానకర్తలు,బీఆర్ఎస్ నాయకులు,రోగి బంధువులు అభినందించారు.

## కెజిబివిలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ నర్సింగ్ సబ్జెక్టు బోధన కోసం గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఎర్ర రజిత మంగళవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై బోధన అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 12 సాయంత్రం 4:30 గంటలలోపు తమ దరఖాస్తులను పాఠశాల కార్యాలయంలో నేరుగా సమర్పించాలి. మరిన్ని వివరాలకు విద్యాలయ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

## రద్దీతో కళకళలాడిన శ్రీ ఎల్లమ్మ దేవాలయం




**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో గల శ్రీ ఎల్లమ్మ దేవాలయం మంగళవారం భక్తుల రద్దీతో కళకళలాడింది. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లెక్కింపులో వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.82,550, హుండీ ఆదాయంగా రూ.15,508 సమకూరినట్లు అధికారులు తెలిపారు. దీంతో మొత్తం ఆదాయం రూ.98,058కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటేషన్ సిబ్బంది కల్వకుంట్ల అనిల్‌రావు, కూకట్ల రాజేందర్, మ్యత నర్సవ్వ పాల్గొన్నారు. భక్తులకు, ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫి క్ ఇబ్బందులు తలెత్తకుండా మెట్‌పల్లి పో లీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. భ క్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుం డా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కా ర్యనిర్వహణ అధికారి కె.కాంతారెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

### ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మెట్‌పల్లి నగర శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని కోరుతూ మంగళవారం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళపల్లి మారుతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల శాతం క్రమంగా తగ్గిపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి,విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని విద్యా శాఖ నిబంధనలను అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి కలికోట ప్రణీత్, కోయల్కర్ హరీష్, చరణ్, ముఖేష్,తదితరులు పాల్గొన్నారు.

## మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముత్యంపేట గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీకి విధేయుడి గా ఉన్న శ్రీనివాస్ గౌడ్‌కి పదవి కట్ట బెట్టినట్లు తెలుస్తుంది. త్వరలో మండల,జిల్లా పరిషత్తు ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్ ను నియమించడం కాంగ్రెస్ పార్టీకి కలిసి రానున్నదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి నియామకంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు డిసిసి అధ్యక్షులు,స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా,మండలంలోని నాయకులను కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

## కెక్కెర్ల రాజయ్య నేత్రదానం



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలానికి బేగంపేట చెందిన కెక్కెర్ల రాజయ్య మరణానంతరం వారి కుటుంబ సభ్యులు గొప్ప మానవతా నిర్ణయం తీసుకొని నేత్రదానానికి అంగీకరించారు. ఈ సందర్భంగా రాజయ్య రెండు కార్నియాలను సేకరించి అవసరమైన వారికి అందించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ, మరణానంతరం కూడా మరొకరికి చూపునిచ్చే నేత్రదానం అత్యున్నత దానమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకొని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజయ్య కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. మృతుని కుటుంబసభ్యులు కుమారుడు రాజ్ కుమార్, కోడలు రమాదేవి, కుమార్తెలు బొల్లెపల్లి పద్మ, వేముల విజయ, మోతుకూరి స్వర్ణలత, వడ్లకొండ సునీతలు నేత్రదానానికి సహకరించినందుకు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోయిన తీవ్ర విషాద సమయంలోనూ నేత్రదానానికి అంగీకరించి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన రాజయ్య కుటుంబ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు. వారి ఈ మానవతా నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని,మరెందరో నేత్రదానానికి ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బుద్ధార్థి బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, తోట చంద్రయ్య, తులసి రామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతుకూరి అవినాష్ గౌడ్, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు సమ్మయ్య తదితరులు పాల్గొని రాజయ్య కుటుంబ సభ్యులను అభినందించారు. రాజయ్య కుటుంబం చూపిన ఈ మానవతా స్ఫూర్తి సమాజానికి స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** వివిధ వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుమారు రూ.9.25 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.పేద ప్రజలకు అత్యవసర వైద్య ఖర్చుల సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,కల్లెడ గంగాధర్,మామిడి రాజశేఖర్ రెడ్డి, ఎండీ జాఫర్, బైండ్ల శ్రీకాంత్,పొన్నం భూమనందం గౌడ్, రెబ్బస్ మల్లేష్,మొగిలి రాజేందర్‌తో పాటు,లబ్ధిదారులు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌టియు ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే ఆయుధంగా, విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆవిర్భావం చెంది జూన్ 9 1947న ప్రభుత్వ గుర్తింపు పొంది 79 వసంతాల పాటు విద్యా, ఉపాధ్యాయ రంగంలో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచి, సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో శాశ్వత వ్యవస్థాపక సభ్య సంఘంగా ఉన్న ఎస్‌టియు 80వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సంఘ స్థలంలో పతాక ఆవిష్కరణ గావించి ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ సమావేశంలో మేరుగు సతీష్ మాట్లాడుతూ ఎస్‌టియూ 80 వసంతాలుగా ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల మదిలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని, అప్రెంటిస్ రద్దు మొదలు అనేక సమస్యల పరిష్కారంలో ఎస్టియు ముందంజలో ఉండి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నడిపి ఒదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి మాధవ చారి, రాష్ట్ర నాయకులు మందల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా బాధ్యులు కట్కొజ్వల శ్రవణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబులకు ట్రాఫిక్ విధులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ రోడ్లపై తిరిగి ప్రమాదాలకు కారకులు కావొద్దనే ఆలోచనతో చట్టపరంగా కఠినశిక్షలను విధిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిని సోమవారం స్థానిక కోర్టులో హాజరుపర్చా గా, విచారణ జరిపిన జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ N మంజుల గొట్టే పవన్ కుమార్,గోసుకుల అశోక్ కు 2 రోజులు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారని ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## పార్టీకి కార్యకర్తలు కృషి చేయాలి

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని పార్టీ సభ్యత్వ న మోదు నియోజకవర్గ ఇంచార్జ్ తుల ఉమ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్ర ంలో బీఆర్ఎస్ మం డల అధ్యక్షులు గుజ్జు ల రాజిరెడ్డి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎ న్నికల సమయంలో ఇచ్చిన హా మీలను అ మలు చేయడంలో పూ ర్తిగా విఫలమైంద ని, ముఖ్యంగా రైతులకు రుణమాఫీ , యు వతకు ఉద్యోగాలు, మహిళలకు భరో సా వంటి కీలక హామీలను నెరవేర్చకుండా ప్ర జలను మోసం చేసిందని ఆరోపించారు. బూత్ ఇంచార్జ్లు బాధ్యతగా పనిచేసి పార్టీ సభ్యత్వ నమోదు పెంపుకు పూర్తి స్థాయిలో కృషిచేయాలని సూచించారు. కా ర్యక్రమం లో బీఆర్ఎస్ మండల సీనియ ర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావుల వద్ద ఇసుకకు అనుమతులతో ఇబ్బందులు



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ మూల వాగు పక్కనగల వ్యవసాయ బావుల వద్ద ఇసుకకు అధికారులు అనుమతులు ఇస్తున్నారని, ఇసుక తీసే ప్రాంతం రైతుల వ్యవసాయ బావులకు దగ్గరగా ఉండడం తో రైతులు ఆందోళన చెందుతున్నారని, కావున సంకెపెల్లి వాగు నుండి ఇసుకకు అధికారులు అనుమతులు ఇవ్వాలని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి. రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ మూలవాగు నుండి ఇసుకను నెలకు ఒక సారి ,15 రోజులకు ఒకసారో అనుమతులు ఇవ్వడం తో భవననిర్మాణ కార్మికులు, ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి ప్రతిరోజూ ఇసుక, మొరం, మట్టికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కోరపల్లి గ్రామంలో బడిబాట

**ప్రజాపక్షం/జమ్మికుంట :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలకనుగుణంగా జయశంకర్ బడి బాటలో భాగంగా మంగళవారం కోరపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయు లు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపిస్తే కలిగే లాభాలను గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సంవత్సరం ప్రా థమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతు ల ను ప్రభుత్వ ఆదేశానుసారం ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రీ ప్రైమరీ విషయమై తల్లిదండ్రులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. కోరపల్లి గ్రామంలోని బడి ఈ డు పిల్లలందరినీ ప్రభుత్వ బడికే పంపాలని ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గు డి మిల్ల బలరాం,విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందర్ రెడ్డి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జమ్మికుంటలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్తో కలిసి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కనీస వేతనాలను సవరిస్తూ మే 30న జి.వో.నం.6ను రాష్ట్ర ప్రభుత్వం 3 జోన్లుగా కార్మికులను 4 కేటగిరీలుగా విభజించిందని అన్నారు. హుజురాబాద్, జమ్మికుంట ఏరియాలోని సీడ్ మిల్లులు, కాటన్ జిన్నింగ్ మిల్లులు, పాల డైరీలు, సామిల్లులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్, పెట్రోల్ పంపులు, హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోంలలో ఈ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, పెండింగ్ సమస్యలపై కార్మిక సంఘాలతో ఈడీ కమిటీ చర్చలు జరపాలని, విద్యుత్ బస్సులు ఆర్టీసీ నడిపేలా విధాన మార్పులు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీకి రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం రైతు డిస్కాం అనే పేరుతో కొత్త డిస్కాం ఏర్పాటు చేసిందని ఇది రైతులకు, సామాన్య, మధ్య తరగతి వినియోగదారులకు తీవ్ర నష్టదాయకమైందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన డిస్కాంలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.45,398 కోట్లను వెంటనే విడుదల చేయాలని సిఐటియు కోరుతుందన్నారు. భవన నిర్మాణం కార్మికులకులకు హెల్త్ టెస్టులు రద్దు చేసి ఇన్సూరెన్స్ కంపెనీల ఇచ్చిన స్కీంలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. హమాలీలందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కార్మిక సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో ఉన్న నేపథ్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రావుల ఓదేలు, పుల్లూరి రాములు, సాగర్ల కుమార్, బోల్ల రాజు, కొంద్ర క్రాంతి, మారేపల్లి కిరణ్, మదనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారంలో 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

### వైద్య పరికరాలు, రికార్డుల పరిశీలన



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 108 కోఆర్డినేటర్ జంపాల కుమారస్వామి మంగళవారం ముత్తారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న 108 అంబులెన్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత కొన్ని రోజులుగా ముత్తారం మండలంలో అందుతున్న అత్యవసర వైద్య సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా అంబులెన్స్లోని వైద్య పరికరాల పనితీరు, అత్యవసర ఔషధాల (మందుల) లభ్యత, సిబ్బంది హాజరు, పని తీరుతో పాటు పలు రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో 108 సేవల నిర్వహణ తీరుపై ఈ సందర్భంగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

**సమయస్ఫూర్తితో సేవలు అందించాలి :** ఈ సందర్భంగా కోఆర్డినేటర్ కుమారస్వామి మాట్లాడుతూ.. అత్యవసర కేసులు వచ్చిన వెంటనే సిబ్బంది క్విక్ రియాక్షన్ టైంతో స్పందించాలని, సమయస్ఫూర్తితో ప్రాణరక్షణ సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణీల ప్రసవ సమయాల్లో ప్రస్తుత వేసవి కాలంలో పెరుగుతున్న వడదెబ్బ (సన్స్ట్రోక్) కేసుల నేపథ్యంలో ప్రజలందరూ 108 అంబులెన్స్ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ముత్తారం 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కొంక సాగర్, పైలట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులున్నది ప్రజలకు సేవ చేయడానికే

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రజలు కట్టే పన్నులతో పనిచేస్తున్న అధికారులు ఉన్నది ప్రజలకు సేవ చేయడానికే తప్ప రాజకీయ నాయకుల కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు భయపడి పనిచేయడం కాదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. మండల కేంద్రంలో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఎమ్మార్వో రామచందర్, ఎంపీడీవోల పనితీరుపై ఫిర్యాదులు చేయ గా పనితీరు మార్చుకొని ప్రజలకు సేవ చేయాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు పనిచేస్తే సామాన్య ప్రజల పనులు ఎలా అవుతాయని పని తీరు మార్చుకోవాలని సూచించారు. మరో మారు ప్రజల నుండి ప్రజా ప్రతినిధుల నుండి ఫిర్యాదులు అందితే ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ప్రేమతో హెచ్చరించారు.

## వాన కాలంలో పంట మార్పిడిపై అవగాహన



**ప్రజాపక్షం/జమ్మికుంట :** వర్షాకాలంలో ఎలినినో ప్రభావంతో వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున పంట మార్పిడి చేసుకోవాలని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వేణుగోపాల్ రైతులకు సూచించారు. మంగళవారం శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో వానకాలం సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి ప త్యామ్నాయంగా పెసర, మినుపు, కంది, వేరుశనగ లాం టి లాభసాటి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వరి కోసిన రైతులు పంట అవశేషాలను కాల్చవద్దని పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయఅధికారి వెంకటేశ్, సీఈవో రాజ్కుమార్, రైతులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా రాజు



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట పట్టణానికి చెందిన చందా రాజును తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కా ర్యదర్శిగా మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది ల క్ష్మీ నారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని రాజుకు అందజేశారు. ఆర్యవైశ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడే చందా రాజు గతంలో కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా పని చేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా చందా రాజు మట్లాడుతూ తన నియామకానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. రాజు నియామకం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు ఆత్మీయ సన్మానం



**ప్రజాపక్షం/రామగిరి :**రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో నాణ్యత విభాగం డిజియంగా విధులు నిర్వహిస్తూ రామగుండం 2 ఏరియా సేఫ్టీ ఆఫీసర్గా బదిలీపై వెళ్తున్న బి.వి.సత్య నారాయణ, పర్సనల్ విభాగంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్గా విధులు నిర్వహిస్తు రామగుండం2 ఏరియాకు బదిలీపై వెళ్తున్న వి. సునీల్ ప్రసాద్లను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం 3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ యం.రామ్మోహన్, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు మంగళవారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వోటుజియం బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ వి.దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫొంటింగ్, జి.శంకర్, విభాగాధిపతులు రాజేంద్ర కుమార్, బి.టి.మురళీ కృష్ణ, రాజారెడ్డి, ఉదయ్ భాస్కర్, బి.సుదర్శనం, సురేఖ, ఐలయ్య, రాజేశ్వరి, పాపయ్య, మేఘనతో పాటు ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కతార్లో హోమ్కేర్ నర్సుల ఉద్యోగాల భర్తీకి భారీ డ్రైవ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ఆధ్వర్యంలో కతార్లో హోమ్కేర్ నర్సుల ఉద్యోగాల భర్తీకి ఈ నెల 9, 10 తేదీలలో భారీ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కతార్లోని ప్రతిష్టాత్మక ఆసుపత్రిలో హోమ్కేర్ నర్సుల నియామకం కోసం ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, బి.ఎస్సీ లేదా జి.ఎన్.ఎమ్ నర్సింగ్ పూర్తి చేసి, కనీసం రెండు సంవత్సరాల నర్సింగ్ అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారు రోజుకు 12 గంటలు, వారానికి 6 రోజులు విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఎంపికైన వారికి నెలకు 5,000 ఖతార్ రియాల్స్ (సుమారు 1,14,000) వేతనంతో పాటు ఉచిత నివాసం, వైద్యం, రవాణా, వీసా, విమాన ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. 2025 అక్టోబర్ 12న హైదరాబాద్లో నమోదు చేసుకున్న నర్సుల కు ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థులు 9440052 081/94 40051763/9440052592/ 9440049645 నంబర్లలో సంప్రదించాలని, తమ సి.విలను tomcom global @gmail. com కు పంపవలసిందిగా జిల్లా ఉపా ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సమీకృత కూరగాయల మార్కెట్ పనులు పూర్తి చేయాలని బీజేపీ ధర్నా

**ప్రజాపక్షం/మెట్పల్లి :** మెట్పల్లిలో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్ మాట్లాడుతూ, కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన మార్కెట్ ఇప్పటికీ వినియోగంలోకి రాకపోవడం దురదృష్టకరమన్నారు.దీంతో పట్టణ ప్రధాన రహదారులపై కూరగాయల విక్రయాలు కొనసాగి ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు.మార్కెట్ ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఆరోపించారు.బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప్వేణుగోపాల్ మాట్లాడుతూ, మిగిలిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులు, వ్యాపారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమీకృత మార్కెట్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయని అన్నారు. త్వరలో పనులు ప్రారంభించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నా అనంతరం బిజెపి నాయకులు మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందజేశారు.

## కిష్టాపూర్ శివారులో పేకాట స్థావరంపై దాడి

### నలుగురు అరెస్ట్.. రూ.7,040 నగదు, సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ శివారులో గల మామిడి తోటలో డబ్బులు పందెంగా పెట్టుకుని పేకాట ఆడుతున్న స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో కలిసి రాత్రి 8:30 గంటల సమయంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించి కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాసాల రవి, గోనే మురళి, కోల రాజేష్, భూక్య రాజులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, పోలీసుల దాడి సమయంలో సురమల్ల ప్రకాష్, పోతుగంటి వెంకటేష్, చింతల రాజ్‌కుమార్ (కిష్టాపూర్), గంధం విజయరావు (మన్నెగూడ) పరారైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ. 7,040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## జర్మన్ భాషా శిక్షణ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు

### ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

ప్రజాపక్షం / నస్పూర్ : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల ఇల్లందు క్లబ్ లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు సకాలంలో హాజరై కవరేజ్ చేయాలని ఆహ్వానించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ అడ్మిషన్లు

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బంబార గ్రామంలో ఇంటర్ అడ్మిషన్ల కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ మూతినేని చంద్రయ్య నేతృత్వంలో అధ్యాపకుల బృందం గ్రామాన్ని సందర్శించి పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, విద్యార్థినులతో సమావేశమయ్యారు.ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అవసరమైన అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయించి, దరఖాస్తు ఫారాలను స్వీకరించారు.

# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీలో ఐటిడిఎ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ సర్పంచి సోయం శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి, భూమిపూజ చేసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామంలో రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు.ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఐటిడిఎ ద్వారా నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రోడ్లు, తాగునీరు,



పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సోయం సంజీవ్, వార్డు సభ్యులు, గ్రామ పటేల్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి రాష్ట్ర స్థాయి అవార్డు

### బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రమేష్

ప్రజాపక్షం / రెబ్బెన : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రాష్ట్ర అత్యుత్తమ పర్యావరణ పనితీరు అవార్డు2026 దక్కించుకుంది. కాలుష్య నియంత్రణ, బయో మెడికల్ వేస్ట్ సురక్షిత నిర్వహణ, పర్యావరణ పరిశుభ్రతలో చూపిన ప్రతిభకు గాను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఈ రాష్ట్ర స్థాయి అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా బెల్లంపల్లి ఏరియాలోని పర్యావరణ విభాగపు అధిపతి ఎ. హరీష్ బెల్లంపల్లి ఆసుపత్రి తరపున అందుకున్నారు. అనంతరం ఈ అవార్డును బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీ రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎం. శ్రీ రమేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పర్యావరణ హిత చర్యలు, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాల అమలుకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందని



తెలిపారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణకు మరింత కట్టుబడి పనిచేయాలని కోరారు. ఈ అవార్డు బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ సిఎంఓ పాండు రంగ చారి, ఆసుపత్రి సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహర, బీపీఏ ఓసీ పీఓ ఎన్. ఉమాకాంత్, హెచ్ఓడీ వి. సాగర్, బీపీఏ ఓసీ మేనేజర్ పి. మహేష్, అధికారులు పాల్గొన్నారు.

# రక్తదానంతో ఎంతో మందికి ప్రాణదానం

### తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గణేష్

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి కొత్త జీవితం అందిస్తుందని, ఇది ప్రాణదానంతో సమానమని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ గణేష్ అన్నారు. పర్యావరణ ఉత్సవాల సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 17 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జూన్ 1 నుండి 12 వరకు నిర్వహిస్తున్న పర్యావరణ ఉత్సవాల నేపథ్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా జీవన్ ధార స్వచ్ఛంద రక్తనిధి కేంద్రం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అటవీ అభివృద్ధి సంస్థ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ మేనేజర్ గణేష్ మాట్లాడుతూ అడవుల సంరక్షణ బాధ్యతల మధ్య కూడా సమాజ శ్రేయస్సు కోసం సిబ్బంది రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు సహాయం అందుతుం



దని తెలిపారు. ఈ శిబిరంలో గణేష్‌తో పాటు ప్లాంటేషన్ మేనేజర్లు గోగు సురేష్ కుమార్, లక్ష్మణ్, జలపతి రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. డివిజన్ కార్యాలయ ఉద్యోగులు, ఫీల్డ్ సూపర్వైజర్లు, ప్లాంటేషన్ వాచర్లు పాల్గొని మొత్తం 17 యూనిట్ల రక్తాన్ని అందించారు. జీవన్ ధార స్వచ్ఛంద రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో దాతలకు ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త సేకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులను రక్తనిధి కేంద్రం నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు రఘు, శివ, ప్రియాంక, గణేష్, గోగు సురేష్ కుమార్, లక్ష్మణ్, జలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బిర్సా ముండా వర్ధంతి వేడుకలు

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల మన్యం వీరుడు బిర్సా ముండా 126వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బౌద్ధ మత గురువు భంతే భరద్వాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 19వ శతాబ్దం చివరలో నేటి బీహార్, ఝార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి బిర్సా ముండా నాయకత్వం వహించారని తెలిపారు. ముండా జాతికి స్వర్ణయుగం తీసుకురావాలనే సంకల్పంతో కేవలం 22 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకులపై పోరాటానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షుడు శ్యామ్‌రావు లాహూజి దుర్గే, బుద్ధ ఉపాసకులు పొందుజి జాడే, రమేష్ మారుతి, భిక్షపతి, సురేష్, మోతీరాం పాల్గొన్నారు.

## నస్పూర్‌లో నేడు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత


ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : నస్పూర్ 33 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మరమ్మతుల పనుల నేపథ్యంలో ఆర్‌కెపి సబ్‌స్టేషన్, ఆవడం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలతో పాటు నస్పూర్ సబ్‌స్టేషన్‌లోని ఆర్ అండ్ ఆర్ ఫీడర్‌కు సంబంధించిన టిఎన్‌జిఓఎస్ కాలనీ, న్యూ మూన్‌లైట్ బార్ పరిసరాలు, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ హాస్పిటల్, సంజీవరెడ్డి కాలనీ, శ్రీపాద సిటీ, రిలయన్స్ జియో బ్యాక్‌సైడ్, వీఎంఆర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది. అందువల్ల ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నస్పూర్ సబ్ డివిజన్ ఏడిఇ ఎన్. రాజశేఖర్, మంచిర్యాల రూరల్ ఏఇ కె. రాంచందర్ విజ్ఞప్తి చేశారు.

## ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చేప మందు పంపిణీ



ప్రజాపక్షం / దండేపల్లి : దండేపల్లి మండల కేంద్రంలో మృగశిర కార్తెను పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన ఉచిత చేప మందు పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. రంగ సాయి ప్రేమ్ సాగర్, భూలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. దగ్గు, దమ్ము, ఉబ్బసం వ్యాధుల నివారణ కోసం ఉదయం నాలుగు గంటల నుంచే వేలాది మంది ప్రజలు విచ్చేసి బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన రోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చేప ప్రసాదాన్ని స్వీకరించారు. రెండు రోజుల క్రితమే దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విచ్చేసిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వర్ నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, మాజీ ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, ఉచిత చేప మందు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను సందర్శించిన ఐఎఎస్ శిక్షణాధికారులు



ప్రజాపక్షం / జన్నారం : తెలంగాణ దర్శన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్ ఐఎఎస్ శిక్షణాధికారులు ఇ. సాయి శివాని, సచిన్ బసవరాజ్, పి. హరి ప్రసాద్, సురేష్ పామూరి మంగళవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. టైగర్ రిజర్వ్‌లోని సఫారీ మార్గంలో వన్యప్రాణులను వీక్షిస్తూ బర్డ్ వాచింగ్‌లో పాల్గొన్నారు. జన్నారం, తాళ్లపేట అటవీ రేంజ్‌ల పరిధిలోని మల్యాల వాచ్ టవర్, బైసన్ కుంట, నీలుగాయి సోలార్ కుంటలను వారు పరిశీలించారు. కవాల్ సాంక్చురీ, టైగర్ రిజర్వ్‌లోని వివిధ వృక్ష, జంతుజాలం, అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు, ఎకో టూరిజం కార్యక్రమాల గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం. రామ్ మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి రాము శిక్షణాధికారులకు పలు అంశాలపై వివరాలు అందించారు. అటవీ సిబ్బంది భోజ, శ్రీకాంత్, అజీజ్ పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రామకృష్ణ ఎంపిఓ సోలమాన్‌రాజ్ ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు.ఎంపిడీఓ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆయా గ్రామాలలోని డ్రైన్లు మురికి కాలువలు చెత్తా చెదారం శుభ్రత ఉండేలా చూసుకోవాలని , రోగాలు ప్రబలకుండా ఇంటి ముందు నీటి నిల్వ ఉంచదకుండా తగు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనంలో తాగుబోతుల తందానా

**ప్రజాపక్షం/నర్సాపూర్ (జి) :** నిర్మల్ జిల్లా, నర్సాపూర్ (జి) మండలం, గొల్లమాడ గ్రామంలో గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం కల్పించడానికి, పల్లెల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం పల్లె ప్రకృతి వనం గొల్లమాడ గ్రామంలో ఒక్క ఎకరం కంటే ఎక్కువ ఖాళీ స్థలంలో ఈ వనం ఏర్పాటు చేశారు. ఈ వనం యొక్క ముఖ్య ఉద్దేశం కాలుష్యం తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించడం, గ్రామస్తులకు ఉదయం సాయంత్రం వేళలో నడక కోసం వాకింగ్ ట్రాక్ లను విశ్రాంతి తీసుకోవడానికి బెంచీలను ఏర్పాటు చేశారు. కానీ ఈ ప్రకృతి వనానికి అతి సమీపంలో బెల్టు షాపు నిర్వహణ జరుగుతుండటంతో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్లు, మందు సీసాలతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పల్లె ప్రకృతి వనంలో తాగుబోతులకు తందానా దేవానందనానా అంటూ అడ్డు అదుపు లేకు ండా రాత్రింబవళ్ళు మందుబాబులకు ఒక నిలయంగా మారడంతో ఉదయం సాయంత్రం నడక కోసం వెళ్ళి విశ్రాంతి తీసుకుందామను కుంటే వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ చొరవ తీసుకొని పల్లె ప్రకృతి వనానికి కొత్తదనం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## కమల్‌కోట్ రాజరాజేశ్వర ఆలయంలో హుండీ చోరీ

**ప్రజాపక్షం / మామడ :** మామడ మండలం కమల్‌కోట్ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ రాజ రాజేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీకి పాల్పడ్డారు. ఆలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, దుండగులు అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించి, భక్తుల కానుకల హుండీని ఎత్తుకెళ్ళారు. కొద్ది దూరంలో హుండీని పగులగొట్టి, అందులోని నగదు తీసుకున్న అనంతరం, ఖాళీ హుండీని గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువులో పడేసి పరారయ్యారు. ఈ విషయం మంగళవారం ఉదయం వెలుగులోకి రాగా, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు వెంటనే మామడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సిసిటీవి ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. త్వరలో నిదితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్.ఐ. తెలిపారు.

## సిహెచ్‌పి కార్మికుల సమస్యలపై ఐఎన్‌టియుసి ప్రత్యేక దృష్టి

### ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని సిహెచ్‌పి కార్మికులను మంగళవారం ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) నాయకులు నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్‌రావు ఉద్యోగులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత యాజమాన్య అధికారులతో చర్చించారు. సిహెచ్‌పి ప్రాంతంలో అధికంగా వ్యాపిస్తున్న దుమ్ము కారణంగా ఉద్యోగులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని కార్మికులు వివరించారు. దీనిపై స్పందించిన జెట్టి శంకర్‌రావు దుమ్ము నివారణకు క్రమం తప్పకుండా వాటర్ స్ప్రే ఏర్పాటు చేయాలని కోరారు.బెల్ట్ ఆపరేటింగ్ మిషన్ల వద్ద విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ల భద్రత కోసం అదనపు సేఫ్టీ గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల ఆర్‌కే న్యూటెక్ గనిలో సర్ఫేస్ హాలర్ ఆపరేటర్‌కు జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. మిషనరీల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు, క్రమం తప్పకుండా నిర్వహణ పనులు, అధికారుల నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఉద్యోగులకు తగిన తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు కన్వేయర్ బెల్టులు, వెహికల్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాంతాలు, వ్యాగన్ లోడింగ్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఐఎన్‌టియూసీ నాయకులు ఇన్‌చార్జ్ డీజీఎం చంద్రలింగంను కలిసి విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అవసరమైన రక్షణ చర్యలు చేపట్టి కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు గరిగె స్వామి, పిట్ కార్యదర్శి లతీఫ్, కేంద్ర నాయకులు శనిగరపు రవి, బ్రాంచ్ నాయకులు రాగం శ్రీనివాస్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## డాక్టర్ దామెర రాములుకి ఘన సన్మానం

### వైద్యం అట్టడుగు వర్గాలకు చేరాలి



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ దామెర రాములుకి ఘన సన్మానం జరిగింది. ఇటీవల ఆయన అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (API) తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల్ నర్సింగ్ హోంలోని దామెర సాహితీ క్షేత్రంలో తెలంగాణ రచయితల వేదిక (తెరవే) నిర్మల్ జిల్లాశాఖ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) మరియు డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సన్మాన వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ అప్పాల చక్రధారి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు, మరియు తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ళ హనుమంతు ప్రసంగాలలో డాక్టర్ దామెర రాములు గత నాలుగు దశాబ్దాలుగా నిర్మల్ ప్రాంతంలో అందిస్తున్న నిరంతర వైద్య సేవలను, అలాగే తెలుగు సాహిత్య రంగానికి ఆయన చేస్తున్న విశేష కృషికి ఘనంగా కొనియాడారు. సన్మాన అనంతరం డాక్టర్ దామెర రాములు గారు మాట్లాడుతూ, శాస్త్రీయమైన ఆధునిక వైద్యం సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరే వరకు వైద్యులు సామాజిక సేవా దృక్పథంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.వైద్య సేవలను మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా ప్రజల్లో అవగాహన కల్పించడానికి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ వేడుకలో ఐఎంఏ నిర్మల్ అధ్యక్షులు డాక్టర్ కే.మురళీధర్, మానస సాహితీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ తుమ్మల దేవరావు, యువ కవి పురస్కార గ్రహీత పోలీస్ భీమేష్, నిత్య కవి అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, మరియు తెరవే ఈసీ సభ్యులు కుమ్మరి నాగారం తదితర ప్రముఖులు పాల్గొని డాక్టర్ రాములు గారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని మోర్తాడ్ మండలం ఎస్సై రాము పేర్కొన్నారు. 7వ తేదిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ నుంచి ముగ్గురు విద్యార్థులు పోటీలలో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో పతకాలు గెలుపొందిన విద్యార్థులను మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాము ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా కరాటే మాస్టర్ జోగు శివాని సైతం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై రాము మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి తమని తాము రక్షించుకోవడానికి చిన్ననాటి నుంచి విద్యార్థి దశ నుంచి కరాటే వంటి యుద్ధ విద్యలు, ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఈ మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలను తప్పకుండా చిన్నప్పటి నుంచి నేర్పించాలని కోరారు. కరాటే మాస్టర్ జోగు శివాని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎఫ్ ఎస్ ఐ కోర్సు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన బిఎఫ్ ఎస్ ఐ కోర్స్ గురించి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిసిఈ నుంచి వచ్చి ట్రైనర్స్ అనుపమ, అఖిల అవగాహన కల్పించారు. కొత్త కోర్సు సిలబస్ అప్రెంటిషిఫ్, ట్రైనింగ్ శిక్షణ గురించి బ్యాంకింగ్ రంగంలో ఉన్నత ఉద్యోగ అవకాశాల గురించి తెలియచేశారు. కాబట్టి బిఎఫ్ ఎస్ ఐ డిగ్రీలో జాయిన్ అయినా విద్యార్థినీ విద్యార్థులకు రెండు సంవత్సరాలలో థియరీ, మూడో సంవత్సరం ఇంటర్న్‌షిఫ్ ఉంటుందన్నారు. కావున బిఎఫ్ ఎస్ ఐ కోర్సులో విద్యార్థినీ విద్యార్థులు ఎక్కువ మంది జాయిన్ కావాలని ప్రిన్సిపాల్ పెద్దన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకులను కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మర్రిమల్లి భూపతి, కో ఆర్డినేటర్ దశరథ్, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## చేతికి అందే ఎత్తులో విద్యుత్ వైర్లు



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** మండలంలోని కంకిట గ్రామానికి చెందిన రొడ్డ లక్ష్మన్న అనే రైతు యొక్క వ్యవసాయ క్షేత్రంలో చేతి కందే ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. విద్యుత్ అధికారుల దృష్టికి పలుమార్లు సమస్యను విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవ దంతో ప్రమాదంగా మారాయి. కంకెట గొల్లమాడ గ్రామాల సరిహద్దుల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నటానికి మరీ ఇతర పనులకు చేయడానికి వీలు లేకుండా ఉండటం వల్ల పనులు చేసుకోవడానికి ఇబ్బందిగా మారాయి. ఎల్.టీ. వైర్లపై 11 కేవీ వైర్లు లూజుగా ఉండి ఈదురు గాలులు వీచినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది దీనివల్ల మోటార్లు కాలిపోయే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని రైతు కోరుతున్నాడు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని న్యూలోలం గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) వర్క్ సైట్ వద్ద కూలీలకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీల సౌకర్యార్థం సర్పంచ్ శ్రీలత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అరుణ రాణీలు, ఎంపిఓ గోవర్ధన్ ఉమ్మడిగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు ఎండల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి ఎంపిఓ గోవర్ధన్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏపిఓ , దివ్యారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ టిఏ, వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్, ఎఫ్ఏ మహేష్, మరియు పంచాయతీ కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ ఆదర్శ పాఠశాలలో వాచ్‌మెన్, ఎఎన్ఎం పోస్టులకు ఆహ్వానం

**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండలం కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో గర్ల్స్ హాస్టల్‌లో ఏ.ఎన్.యం. వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుచేసుకోవాలని మండల విద్యాధికారి మహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ.ఎన్.యం. పోస్టులకు విద్యార్హత ఇంటర్మీడియట్‌తోపాటు ఎ.ఎన్.యం. ట్రైనింగ్ సర్టిఫికేట్, వాచ్‌మెన్ పోస్టుకు విద్యా అర్హత ఇంటర్మీడియట్ ఈ రెండు పోస్టులకు వయస్సు 18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలి, ఆడవారికి మాత్రమే ప్రాధన్యత ఇవ్వబడును. దరఖాస్తుల స్వీకరణ 10.06.2026 నుండి 13.06.2026 వరకు ఎం.ఆర్సీ బోథ్ కార్యాలయంలో స్వీకరించబడునని తెలిపారు. స్థానిక నివాస అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవలెను. స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును అని యం.ఇ.ఓ. తెలిపారు.

## పిడుగుల శబ్దానికి భయబ్రాంతులైన ప్రజలు .. కురిసిన భారీ వర్షం

**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి పిడుగులతోపాటు కురిసిన వర్షం ప్రజలను వణికించింది. మెరుపు వేగంతో పిడుగులు రావడంతో పాటు పెద్ద పెద్ద శబ్దాలు వస్తుండటంతో ప్రజలు నిద్రలు లేక భయబ్రాంతులకు గురయ్యారు. మండల కేంద్రంలోని కస్తూరి మధుకర్ అనే వ్యాపారికి చెందిన పాట బట్టల దుకాణంపై పిడుగు పడటంతో దుకాణంపై భాగంలో కొంత కాలిపోయింది. పిడుగు పడడంతో పాత అంగడి బజార్ ప్రాంతంలో కొందరి ఇళ్ళల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయని అన్నారు.

## సిరబోయిన కరుణాకర్‌ను పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు,హనుమకొండ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్ హైదరాబాద్ అపోలో హాస్పిటల్ లో మోకాళ్ళకు సర్జరీ చేయించుకున్న సందర్భంగా హనుమకొండ హనుమాన్ నగర్ లోని వారి గృహంలో బిసిహక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది బిల్ల ప్రభాకర్ కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సిరబోయిన కరుణాకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నివాళులర్పించిన సర్పంచ్ మలహాల్ రావు

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల కేంద్రానికి చెందిన దుప్పటి రాధా అనారోగ్యంతో మరణించగా వారి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని స్థానిక సర్పంచ్ కుడ్ల మలహాల్ రావు తెలియజేశారు. సర్పంచ్ వారి వెంట ఉపసర్పంచ్ సంపత్,వార్డ్ నెంబర్ దుప్పటి ఐలయ్య,సదానందం,మల్లేష్, వివిధ పార్టీ నాయకులు ఉన్నారు.

## పాఠ్య పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు,నోటు బుక్కులు,వర్కు బుక్కులు పంపిణీ చేయడం జరిగిందని మండలవిద్యాశాక అధికారి మొగిలిచేర్ల చంద్రమౌళి అన్నారు .మంగళవారం వేలేరు మండలకేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు,గురకుల పాఠశాల,కస్తూర్భ గాంధి పాఠశాలతో పాటు ప్రైమరి,ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలకు దాదాపుగా పాఠ్యపుస్తకాలు,నోటు బుక్కులు,వర్కు బుక్కులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.కార్యక్రమంలో మండలవిద్యాశాఖ అధికారి మొగిలిచెర్ల చంద్రమౌళి,ఉపాధ్యాయులు రవిందర్ రెడ్డి,సిఆర్‌పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎల్. వి. గిరిరాజ్ గౌడ్ కు ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ విద్యా సంస్థలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడ లాగే అనుచందంగా ఉందన్నారు. విద్యా సంవత్సరం జూన్ 15వ తేదీన అన్ని విద్యాసంస్థలు ప్రారంభమవుతున్నాయి ,కానీ ఇప్పటివరకు ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, నాన్ టీచింగ్,ఎంఇఒ, డిఇఒ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ నేడు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయని, పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆశలను ఆసరాగా చేసుకుని వారికి అనేక మాయమాటలు ప్రచార ఆర్భాటాలతో అరచేతిలో వైకుంఠం చూపించి అడ్మిషన్ చేసుకొని ఆ తర్వాత అడ్మిషన్, బుక్స్ ,స్టేషనరీ, డెవలప్మెంట్, ల్యాబ్, లైబ్రరీ, గేమ్స్, ఐఐటి, నీట్ ఫౌండేషన్, ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ ఫీజులు అంటూ అనేక రకాల ఫీజుల పేరుతో లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తూ, వారి రక్తాన్ని జలగల్ల జుర్రుకుంటున్న స్థితి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు

### క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారధి రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**అండర్ 12 అండర్ 14 అండర్ 16 అండర్ 19 క్రీడాకారులకు మూడు గ్రౌండ్స్ లలోటోర్నమెంట్స్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గత 4 రోజులుగా సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ క్రీడాకారులకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం, శనిగపురం గ్రౌండ్, సిద్ధార్థ గ్రౌండ్ లలో అండర్ 12, అండర్ 14, అండర్ 16, అండర్ 19, క్రీడాకారులకు ఎంతో ఉత్సాహంగా ఉత్కంఠ భరితంగా టోర్నమెంట్స్ జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నేడు ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ మానుకోట జిల్లా క్రీడాకారులు గత నాలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్ లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఆకాంక్షించారు. భవిష్యత్తులో రంజి, ఐపిఎల్ జాతీయ జట్టుల్లో స్థానం సంపాదించుకునేలా మానుకోట క్రీడాకారులు ఎదగాలని బి అజయ్ సారధి రెడ్డి కోరారు. ఈ టోర్నమెంట్ లో చీఫ్ కోచ్ మెతుకు కుమార్, అసిస్టెంట్ కోచ్ తోట వినయ్ కుమార్, పిట్టల శ్రావణ్, పరమేశ్వర్, సాద్విత్ రెడ్డి, చరిత్ రెడ్డి, టోర్నమెంట్ స్కోరర్ ధర్మచరణ్ రెడ్డి ,అనిర్వేశ్, తరుణ్, మనీష్ ,అవినాష్, జైనీల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కరపత్రాలను తొర్రూరు పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోలో గ్రామ పంచాయతీ కార్మికులను ఎందుకు చేర్చలేదన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలను గ్రామ పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గ్రామ పంచాయతీ కార్మికులకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని పంచాయతీ కార్మికులతో పాటు ఇతర రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా ఈ నెల 13న గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఎంపీడీఓలకు, 22న కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ తొర్రూరు ఏరియా అధ్యక్షుడు శ్రీరాం పుల్లయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడ్య బీకు, రాష్ట్ర నాయకులు గాదరబోయిన సంతోశ్, మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

## దేవిలాల్ తండాలో దుర్గమ్మ పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాపక్షం/పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని దేవిలాల్ తండాలోని గిరిజన సోదర సోదరీమణుల ఆహ్వానం మేరకు నిర్వహిస్తున్న దుర్గమ్మ పండుగ వేడుకల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని వారి ఆత్మీయ అభినందనలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ సమాజానికి గర్వకారణమని అన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పెద్దలు, మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్మిషన్లు పెంచితే పాఠశాలలు మూతపడే పరిస్థితి రాదు

### జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి
### మూతపడ్డ బాబూనాయక్ తండా పిఎస్ ప్రారంభం
### అడ్మిషన్లు పెంచిన ప్రతిమను అభినందించిన డిఇఒ

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచితే పాఠశాలలు మూతపడే పరిస్థితే రాదని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో రెండు సంవత్సరాలుగా మూతపడి ఉన్న బాబూనాయక్ తండా పిఎస్‌ను తెరిపించాలని సర్పంచ్ కోరడంతో మంగళవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బాబూనాయక్ తండా ప్రాథమిక పాఠశాలను ఈ విద్యాసంవత్సరం తెరిపించి పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభించారు. సర్పంచ్ తమ్ముడి పిల్లలతో సహా 15 మంది విద్యార్థులను బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రారంభోత్సవం, పత్తిపాక ప్రాథమిక పాఠశాలల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వచ్చే వసతులు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఒక ఉపాధ్యాయుడిని ఇస్తామని డిఇఓ హామీ ఇచ్చారు. పత్తిపాక సిఎస్‌లో అడ్మిషన్లు పెంచిన ప్రతిమను డిఇఓ అభినందించారు. పాఠశాలకు ఏది కావాలన్నా తాను సహకరిస్తానని డిఇఓ హామీ ఇచ్చారు. అనంతరం గార్ల కెజిబివిని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ డిఇఓ మాట్లాడుతూ తరగతి గదుల్లో ఐఎఫ్‌బి ప్యానల్స్ ఉపయోగించి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న సివిల్ పనులు పరిశీలించి తరగతి గదులు, టాయిలెట్స్,పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిఇతో మాట్లాడారు. నోట్స్‌బుక్స్, టెక్ట్స్ బుక్స్, లైబ్రరీ బుక్స్ వచ్చాయా అని అడిగి వాటిని పరిశీలించారు. కంప్యూటర్, ఐఎఫ్‌బి ప్యానల్స్ వర్కింగ్‌లో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆకర్షణీయంగా కనిపించాలని డిఇఓ సూచించారు. జిసిడిఓ వై.గాయత్రి, ఏఎంఓ వెంకటేశ్వర్లు, సిఎంఓ సురేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సిరి, ఎంఇఓ వెంకటేశ్వర్లు, మైస శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## ఆధునిక హంగులకు అడ్రస్ ఆ పెట్రోల్ బంక్...

### సేవే ఆయన లక్ష్యం....
### డ్రైవర్లకు ప్రయాణికులకు విశ్రాంతి గదులు



**ప్రజాపక్షం/ములుగు:**తెలంగాణ రాష్ట్రంలో వేలాది పెట్రోల్ బంకులు ఉన్నాయి, కానీ ములుగు జిల్లాలోని జవహర్ నగర్ గ్రామంలో ఉన్న పెట్రోల్ బంక్ వ్యవస్థాపకులు పద్మారావు ఆధ్వర్యంలో దాదాపు మూడెకరాల భూమిలో బంక్ విశ్రాంతి గదులు, త్రాగునీరు సౌకర్యం, హోటల్ సౌకర్యం, బాత్రూం ట్రైలర్స్, షవర్లు, బెడ్స్ ఇలా చాలా సౌకర్యాలు ఏర్పాటు చేసి లారీ డ్రైవర్లు గానీ ప్రయాణికులు గానీ రాత్రివేళలో ప్రయాణం చేసే సమయంలో నిద్ర వస్తుంది, అందువలన ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. దీనికి సహాయంగా డ్రైవర్లకు ప్రయాణికులకు సేద తీర్చేందుకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడం జరిగిందని వారన్నారు. అలాగే వంట చేసుకుని కూడా భోజనం చేయవచ్చు. అలాంటి సౌకర్యాలు కూడా ఉన్నాయని వారు తెలిపారు.

**నిరుద్యోగులను కూడా ఆదరిస్తున్న బంక్ యజమాని**

ములుగు జిల్లాలో జవహర్ నగర్ పెట్రోల్ బంక్ యజమాని పద్మారావు ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నిరుపేద కుటుంబాలు నిరుద్యోగులకు కూడా ఆ పెట్రోల్ బంక్‌లో మహిళలు, యువకులకు ఉద్యోగాలు ఇచ్చి ప్రతి నెల జీతాలు ఇస్తూ వారి కుటుంబాన్ని ఆదుకున్న ఘనత వారికి దక్కిందని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న నిరుపేద కుటుంబాలు నిరుద్యోగులు అంటున్నారు.

**పెట్రోల్‌బంక్‌కు 9 సంవత్సరాలైనా ఇంకా అభివృద్ధి పనులు...**

జోహార్‌నగర్‌లో ఉన్న పెట్రోల్ బంక్ ఇప్పటికి దాదాపు 9 సంవత్సరాలు కావచ్చినా ఇంకా ఆ బంక్‌లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు లారీ డ్రైవర్లకు ప్రయాణికులకు రాత్రి డైవింగ్ చేస్తున్న సమయంలో నిద్ర వస్తుంది. అందువలన నిద్ర పోయేందుకు డ్రైవర్లకు ప్రయాణికులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడం జరిగింది. అందుకు జిల్లాలో ఉన్న డ్రైవర్లు యజమానిని అభినందించారు.

**అభివృద్ధి చేయడమే లక్ష్యం..**
**బంక్ యజమాని పద్మారావు**

సహాయం చేయడం అంటే నాకు చాలా సంతోషమని పెట్రోల్ బంక్ యజమాని పద్మారావు అన్నారు. ములుగు జిల్లాలోని జహానగర్ గ్రామంలో ఇప్పటికే 9 సంవత్సరాలుగా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి చిన్న చిన్నగా అన్ని అభివృద్ధి పనులు చేసి డ్రైవర్లకు ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించి సహాయం చేయడమే నా లక్ష్యమని వారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోనే పెట్రోల్ బంక్‌లో ఇలాంటి సౌకర్యాలు ఎవరు చేయలేదని నాకు అన్ని సౌకర్యాలు ఉండి అందరికి సహాయం చేయడం అంటే చాలా సంతోషంగా ఉంటుందని అన్నారు. అందువలన ఇంకా అభివృద్ధి చేసి నిరుపేదలకు కూడా ఆదుకుంటానని వారన్నారు.